# అనగనగా... ఒక కథ

**మాఘమాసంలో ప్రతీ ఆదివారం ఆవుపాలతో పరవాన్నం చేసి సూర్యుడికి నైవేద్యం చేయడం సూర్యమణి పుట్టించి నుంచి తెచ్చుకున్న సంప్రదాయం. వాళ్ల ఇలవేల్పు సూర్యభగవానుడట-ఇంట్లో అందరికీ పేరేదైనా 'సూర్య' అన్నది కలుపుతారు. భార్య తాలూకు భక్తిని భర్తగా 'ఫుల్‌ఫిల్ చేయడం బాధ్యతగా భావిస్తాడు సురేష్.**

## బృందావనం

కొత్తగా ట్రాన్స్ఫరై పట్నంనుంచి ఓపాటి చిన్న టౌనులో పడ్డ సురేష్‌కి ఇంకా వూరూ వాడా పూర్తిగా పరిచయం అవలేదు. ఆఫీసు వదిలేక రోజుకో కొన్ని వీధులు స్కూటర్ మీద తిరుగుతున్నాడు. మర్నాడు ఆదివారం సెలవొస్తుంది గనక..టవునంతా ఓ రౌండ్ వేసేస్తే మంచిదనుకున్నాడు. శనివారం సాయంత్రం ఇంటికి రాగానే "రేపు మాఘపాది వారం-ఆవుపాలు కావాలి" అని అల్టిమేటం ఇచ్చింది సూర్యమణి.

"అలాగే" అని హామీ ఇచ్చాడు సురేష్. ఆవుపాల వేట, నగర సందర్శనం రెండూ కల్సి వచ్చాయి.

పొద్దున్నే స్కూటరెక్కాడు...

తిరుగుడుగుంచంలా...తిరిగాక..తిరిగాక ఆవులున్న జాడ తెలియలేదు గానీ..అయిడియా వెలిగింది. రోడ్డు పక్క టీ బండి వాణ్ని "ఆవుపాలు కావాలయ్యా ఎక్కడ దొరుకుతాయి" అడిగాడు.

"పూజకా బాబయ్యా"

ఔనన్నట్లు నవ్వాడు సురేష్.

"అవులు పెంపకం తక్కువైపోయింది. గేదెలు యాపారానికి బాగా ఆటొత్తాయి..ఇదివర్లో నాలుగ్గేదెలు ఉన్నోళ్లు...ఓ ఆవుని కూడా మందలో ఉంచుకునేవోళ్లు-ఇప్పుడీ బేంకులోళ్లు క్కూడా గేదెలకీ గొర్రెలకీ అప్పులిస్తన్నారు గానీ..ఆవులనేప్పటికి ఎగాదిగా సూస్తున్నారు.."

వీడి ఉపన్యాసం వినకతప్పదు. చివరాఖరికేనా ఆవుగలవాని ఇంటి అడ్రస్సు కక్కచ్చు..మనస్సులో సణుక్కుంటున్నాడు సురేష్.

అలా కొంతసేపు..పేకట్ పాలూ..హార్లిక్స్ ఫేక్టరీలూ..పాడి పరిశ్రమ..గురించి వాడి పంథాలో ఊదరగొట్టి ఈమధ్యలో సురేష్‌కి ఆర్డరివ్వకపోయినా వేడి వేడి టీ గాజుగ్లాసు నిండా ఇచ్చేసాడు.

టీ పూర్తయి వాడి చేతిలో ముప్పావలా పెట్టేటప్పటికి పాయింట్లోకి వచ్చాడు టీవాలా-.."అలా తిన్నగా ఎల్లగా..ఎల్లగా..గడియారస్తంభం వొత్తది- దానికి ఎడం చేతి వైపుఎత్తే, ఆడపిల్లల స్కూలు-దాని ఎనకాల..మస్తాన్‌వలీ ఉంటాడు..ఆయనకాడ ఆవులు ఉన్నాయి. పాలిచ్చినా ఇయ్యకపోయినా పిచ్చిసాయిబు వాటిని సాకుతుంటాడు.."

వాడు చెప్పిన ఇన్ఫర్మేషన్ చాలు..రయ్‌న స్కూటరెక్కాడు...గానీ...'మస్తాన్‌వలీ' ఆవుల్ని సాకడం దేనికీ...? ఇంకదేనికీ..???

నాలుగేళ్లనాడు పట్నంలో జరిగిన సంగతి గుర్తొచ్చింది సురేష్‌కి- కొత్తగా ఉద్యోగంలో చేరిన రోజులు-స్టాఫ్ అందరూ అతన్ని జూనియర్‌గానూ, చిన్నోడిగానూ, లోకువగా చూసేవారు.. గానీ షేక్ సామీర్ ఖాన్ అనే వ్యక్తిమాత్రం ఇతన్ని ప్రేమగా పలకరించేవాడు. అతనే తనుండే వీధిలో బేచ్‌లర్ గది అద్దెకు ఇప్పించాడు. రోజూ తన స్కూటర్ మీద సురేష్‌ని ఆఫీసుకు తీసుకెళ్లేవాడు..ఓ రోజు ఇద్దరూ ఆఫీసుకెళ్తుండగా..ఓ పెద్ద లారీ కన్పించింది. దాన్నిండా ఆవులు.."ఏదైనా సంతకి తీసుకెళ్తున్నారేమో" అన్నాడు సురేష్.

నవ్వాడు ఖాన్ "..సంతకి కాదు. కబేళాకి"

ప్రాణం చివుక్కుమంది సురేష్‌కి. ఆవులన్నీ జాలిగా చూస్తూ మూగగా రోదిస్తున్నట్లు అనిపించింది.

"గోమాత..గోవుమాలక్ష్మి..అని పూజించే మన దేశంలో.." గోమాతలకి పట్టిన దుర్గతికి అతనికి ఆవేశం తన్నుకొచ్చి ఏంటేటో అభిప్రాయాలు ప్రకటించాడు.

ఆరెస్సెస్‌లో చిన్నప్పుడు కొన్నాళ్లు తిరిగిన ప్రభావం..గోల్వాల్కర్ చేసిన ప్రబోధం..అతనిలో ఉన్న గోప్రేమ, హిందూ ప్రియత్వం అన్నిటివల్లా..ఖాన్ ఏమనుకుంటే అనుకున్నాడని..చాలా వాదించాడు. ఖాన్ ఇతని అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తూనే మాట్లాడాడు. ఆ సంఘటన వీళ్ల స్నేహం మీద కొంత ప్రభావం చూపించింది. ముభావంగా, తటస్తంగా ఉండేవాళ్లు తరవాత్తరవాత.

ఆ తర్వాత కొన్నాళ్లకి పెళ్లి అవడంతో, సురేష్ అతని వీధి నుంచి మరో ఏరియాకి షిఫ్ట్ అయిపోయాడు. పెళ్లికి మావగారిచ్చిన స్కూటర్తో ట్రాన్స్‌పోర్ట్ ప్రోబ్లం కూడా తీరిపోయింది. ఇంకా తర్వాత్తర్వాత...ఖాన్‌ని చూసి పలకరింపుగా కూడా నవ్వాలని అనిపించలేదు అతనికి.

ఇప్పుడు మస్తాన్‌వలీ ఆవుల్ని సాకుతున్నాడంటే అతనికి దేనికో తెల్సు..నిజానికి ఆ చోటుకే..వెళ్లాలని లేదు..కానీ వెళ్లక తప్పదు- అవసరం అతనిది-అలా ఆలోచనల్లోంచి గరల్స్ హైస్కూలుకొచ్చాడు. ఆ వెనకే వలీ ఉండేది. గుండెదిటవు చేసుకుని హైస్కూలు పక్కనున్న సన్నటి దార్లోకి స్కూటర్ పోనిచ్చాడు.

ఎదురుగా సురేష్ ముచ్చటపడిపోయేటంత గొప్ప దృశ్యాన్ని చూశాడు.

**"మీ సందేహం నాకు అర్థమయింది. మా ఇంట్లో మూడు తరాలుగా ఈ గోసేవ జరుగుతోంది! మా ఇంటినుంచి ఏ ఒక్క ఆవూ కబేళాకో మరో దుకాణాలకో వెళ్లదు- వయస్సైపోయి గోవు మరణిస్తే..అదిగో అక్కడ దహనం చేస్తాం..వాటి పాలు, పెరుగూ, జున్నూ, అమ్మిన సొమ్ము వాటికీ మాకూ కడుపునింపుతోంది- దేవుణ్ని పూజ చేస్తే వరం ఇస్తాడంటారుగా..ఇవీ..మాకు రోజూ వరాలు ఇస్తుంటాయి. మూడు తరాలుగా ఇస్తున్నాయి" అన్నాడు మస్తాన్.**

ఆలమందలతో..బృందావనంలా ఉంది ఆ ప్రదేశం.

కనుచూపు మేరలో పచ్చని నేల- నేల ఈనినట్లు అక్కడా అక్కడా గుంపులు గుంపులుగా గోమాతలు! పులకించి పోతున్న సురేష్‌కి సడన్‌గా ఒళ్లు గగుర్పొడిచింది..'ఈ న..వా..బు..గా..రు..ఈ..ఆవులన్నింటినీ..' ఊహించుకోడానికే వొణుకొచ్చింది!!

అంతలో...

తెల్లని బట్టలూ, తెల్లటి గడ్డంతో ఆవులా మెరిసిపోతున్న మస్తాన్‌వలీ పక్కనే వున్న చిన్నడాబా ఇంటినుంచి బైటకొచ్చాడు. చూడ్డానికి మనిషి ప్రశాంతంగా వున్నాడు అనుకున్నాడు సురేష్.

ఆ డాబా వెనకాల నాలుగైదు పందిరి లాంటి రేకుషేడ్లు ఉన్నాయి. దాన్లో కొన్ని బుజ్జిదూడలు కుమ్ముకుంటూ ఆడుకుంటున్నాయి. ఆ షెడ్‌లోకి వెళ్లి ఆ ముసలాయన-



"ఒరే..రహీమ్ చెల్లాయిని ఏడిపించకురా!"

"ఏయ్ ఫక్రుద్దీన్..నువ్వప్పుడే పరిగెట్టకూడదురా నాన్నా" ఇలా ఆ తువ్వాయిల్ని ప్రేమగా వళ్లు నిమురుతున్నాడు.

సురేష్ విస్తుపోతూ చూస్తున్నాడీ దృశ్యాన్ని..ఆయన గొంతు విని ఆవులన్నీ మేత ఆపేసి దగ్గరకొచ్చాయి..ప్రతీ ఆవుని ప్రేమగా తడుముతున్నాడు..గంగడోలు దువ్వుతున్నాడు..కొంతసేపటికి సురేష్‌ని గమనించాడు గోవులాంటి పెద్దాయన.

"మీరు?" అంటూ దగ్గరకొచ్చాడు.

"నేను సురేష్..మీరు??"

"మస్తాన్ వలీ అంటారు"

"ఈ ఆవులన్నీ.."

"మావే..మా ఇంటి దీపాలు..ఐశ్వర్యాలు" సభక్తికంగా స్పష్టమైన తెలుగులో మాట్లాడుతున్నాడు వలీ.

"మీరు ఆవుల్ని..అహ..మీకింత ఆవులమీద..ప్రేమ ఏంటా అని.." నసుగుతూ అడిగాడు సురేష్.

"ప్రేమేకాదు భక్తి..ఇవి మా ఇలవేల్పులు అనుకోండి"

"అర్థం కావట్లేదు..ముస్లిమ్స్..అయిన మీరు ?" అడగలేకపోతున్నాడు.

"మీ సందేహం నాకు అర్థమయింది. మా ఇంట్లో మూడు తరాలుగా ఈ గోసేవ జరుగుతోంది! మా ఇంటినుంచి ఏ ఒక్క ఆవూ కబేళాకో మరో దుకాణాలకో వెళ్లదు- వయస్సైపోయి గోవు మరణిస్తే..అదిగో అక్కడ దహనం చేస్తాం..వాటి పాలు, పెరుగూ, జున్నూ, అమ్మిన సొమ్ము వాటికీ మాకూ కడుపునింపుతోంది- దేవుణ్ని పూజ చేస్తే వరం ఇస్తాడంటారుగా..ఇవీ..మాకు రోజూ వరాలు ఇస్తుంటాయి. మూడు తరాలుగా ఇస్తున్నాయి" అన్నాడు మస్తాన్.

సురేష్ ఆశ్చర్యంలోంచి తేరుకోలేకపోతున్నాడు. కానీ ఆయన కథ కొనసాగించి చెప్పాడు- మస్తాన్ వలీగారి తాతగారి చిన్నప్పుడు పెద్ద జబ్బు చేసిందిట- వైద్యులు ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలమయ్యారుట..ఏ ఆహారం పొట్టలో ఇమిడేది కాదు. నోటి ముందుపెట్టగానే వాంతి అయిపోయేదిట. పళ్లరసాలూ...జావలూ..ఏమీ సయించేవి కాదు... ఆ పరిస్థితిలో ఒక వైద్యుడు..ఆవుపాలూ, ఆవుమూత్రం తాగించమని చెప్పాడు. చిత్రంగా అతను కోలుకుని 80 ఏళ్లు బతికాడు. తన జీవితకాలంలో ఆవుపాలు తప్ప మరే ఆహారం లేకుండా..శక్తిగా, దారుఢ్యంగా ఉండేవాడు మస్తాన్‌గారి తాత...ఆరోజు నుంచీ మృత్యువుముఖంనుంచి తీసుకొచ్చిన గోమాతలంటే వాళ్లకెంతో భక్తిట- గోమాంసమే కాదు ఏ మాంసమూ ఆ కుటుంబంలో ఎవ్వరూ తినరట.

సురేష్ సజల నయనాల్తో ఆయనకి దణ్ణం పెట్టాడు- ఆరోజునుంచీ రోజూ పొద్దుటే అక్కడకొచ్చి ఆ గోమందని ఓసారి చూసి..పాలు కొనుక్కుని వెళ్తుంటాడు. 'పాలు ఇంటికి పంపిస్తానన్నా' ఈ గోదళాన్ని దర్శించుకోవాలని 'వద్దు..నేనే వస్తాన'ని అలా వెళ్లొస్తుంటాడు సురేష్.

*